# మాలతీ విలాపము

రచన:
... ఉదయగిరి ...

టేబిల్ క్లాత్ ఎంబ్రాయిడరీ కుట్టుకుంటూ కిటికీదగ్గిర కూర్చొవుంది మాలతి. ఇంటి చుట్టూ పచ్చగా గుబురుగావున్న తరులతల్లోకి అప్పుడప్పుడు చూస్తూ తనపని చేసుకుంటోంది. సుకుమారి కుట్టికుట్టి కలిగిన శ్రమ నివారణార్థమై కొమ్మలు, రెమ్మలు గాలుల్ని విసురుతూ సేవచేస్తున్నాయి. వసారాపందిరిమీద కాకి ఆగకుండా గోలపెట్టోంది. ఆకాకి బావపాట వినలేక విసిగిపోయింది ప్రాణం. లేచి, "హుష్...హుష్..."మంటూ తరిమి తిరిగివచ్చి కూర్చుంది. గుంజిళ్ళుపెట్టడంతోనే సరిపోయింది మాలతికి. తరిమినపుడు ఒక్క క్షణం తప్పుకుని, మళ్ళా చెవుల్లో 'గీ'పెట్ట సాగింది కాకి. మాలతికి అది చిక్కితే మెడ నులిమేస్తానన్నంత కోపంవచ్చింది. ఇక తనేమి చేయలేక తన కార్యక్రమంలో నిమగ్నురాలైంది.

ఆకాకి ఎందుకలా గోలపెట్టుందో, దాని గోలకేమి సంభవిస్తుందో, పెరటిలో ఉచ్చస్థాయిలో ఆలాపనచేస్తూన్న పెయ్యిదూడ భావమేంటో—మాలతికి అర్థమైంది కాదు. ఈ సమయానికి ఇవో ప్రేతపిశాచిలా తగులుకున్నాయ్ అనుకుంది. మన తాతముత్తాతలనే వాళ్లు — కాకిగోలపెట్టే, పొయ్యిరోద పెట్టే బండిలో బావ దిగుతాడని సహజంగా యీడువచ్చిన ఆడపిల్లలికి తెల్సుంటూంది సామెత పెద్దవాళ్ళు వాడేప్పుడు. అయితే మాలతి వాళ్ళనంగా యెప్పుడూ విన్లేదేమో!

చేతిలో చెర్నాకోల్, చంకలోపెట్టి, నెత్తిమీద మూటతోటి ప్రవేశించాడో వ్యక్తి నల్లగా బొద్దుస్వరూపం. వెనకాలే టిప్‌టాప్ మంటూ బూట్లతో లోనికొచ్చాడో యువకుడు. అల్లుకుంటూన్న మాలతి చటుక్కున చాటుకెళ్ళింది. చాటున ప్రక్కకిటికీలోంచి, హాల్లో బండిబాడుగిస్తున్న ఆ యువకుని స్వరూపాన్ని నిర్ఘాంతపోయి చూస్తూ అట్టే వుండిపోయింది మాలతి. చప్పుడువిని అక్కడ కొచ్చింది వెంకాయమ్మ. అల్లుణ్ణిచూచి తన కళ్ళను తనే నమ్మలేకపోయింది.

గబగబా దగ్గిరకెళ్ళి "ఎన్నాళ్లకు దయుంచేర్రా బాబూ..." అని అతన్ని గుండెకు హత్తుకుంది. "పద భోంచేద్దూగాని...సమయానికే వచ్చేవ్ — లేకుంటేనా..." అని నవ్వుతూ లోనికెళ్ళింది వెంకాయమ్మ.

"ఏఁ సుబ్బన్నా!...అప్రయత్నంగా...మమ్మల్ని పావనులను చేశావ్ బాబూ!" అన్నాడు రామయ్య. సుబ్బారావు కుర్చీలో కూచున్నాడు.

"ఏఁవుంది మావయ్యా! డిగ్రీ సంపాదనతో—ఇంతకాలంగా చదువుతో హోరాహోరీగ సాగిన సంగ్రామం ఈనాటికి తెల్లవారింది. ఒకటి తీరిందిగదా అనుకుంటే మరొకటి యేర్పడింది. ఆ నిరుద్యోగసాగరం యీది గట్టెక్కాలి మరి! అందుగ్గా ఈ వూళ్ళోనే మూడునెల్లు ట్రయినింగ్ అయిందాకా ఉద్యోగసింహాసనం అధిష్ఠించేందుకు వీల్లేదు" అన్నాడు సుబ్బారావ్.

"అంతకన్నా మాకింకేం కావాలీ...నిక్షేపంలా ఇక్కణ్ణేవుండి చదువుకో సుబ్బా!" అన్నాడు రామయ్య. వచ్చినపని అయిందిరా అనుకున్నాడు సుబ్బరావ్.

"అమ్మా...నాన్నా...కులాసేగా?"

"ఈమధ్య అమ్మకు కాస్త జబ్బుచేసింది అనుకోదగ్గంత జబ్బు కాదులే... ఇప్పుడు కులాసే...నాన్నగారు ఆఫీసుకెళ్తున్నారు."

"అమ్మాయ్...అమ్మాయ్!" అని కేకేసింది వెంకాయమ్మ. కిటికీదగ్గర నిల్చొని చూస్తున్న మాలతి గబగబ ప్రక్కగదిలోకి వచ్చి సన్నగా గొంతెత్తి "ఆఁ..." అంది.

"బావకు, నాన్నకు కాళ్ళకు నీళ్ళివే" అంది వెంకాయమ్మ. బావముందుగా నీళ్ళివ్వాలంటే సిగ్గేసింది మాలతికి. "ఉఁహుఁ..." అంది మెల్లిగా. "ఫర్వాలేదుపోవే నీది మరీనూ! బావేం పరాయివాడా?"—అంది.

భుజాన టవలేసుకుని, చెంబుతోటి, అడుగులు లెక్కపెట్టుకుంటూవచ్చి, తండ్రికందించి గబగబా లోనికెళ్ళింది మాలతి. రామయ్య అదుకొని "పిచ్చితల్లి...సిగ్గెందుకూ?..." అన్నాడు నవ్వుతూ.

ఇద్దరు కాళ్లుకడుక్కొని భోజనాలకు కూచున్నారు. ఎప్పుడు తండ్రితోటే కూచుండేది మాలతి. బావతోపాటు తను కూచోవాల్సొచ్చినందుకు లజ్జతో ఉక్కిరిబిక్కిరయింది. వడ్డింపులుచేసి తనూ వడ్డించుకుంది వెంకాయమ్మ. మాలతి అన్నం ఎందుకు కలుపుకోవటంలేదో, బుర్రగోక్కున్నా అంతు చిక్కలా సుబ్బారావుకి. ముందుగానే మొహమాటం లేకుండా అడగడమే మంచిదని నిశ్చయించుకున్నాడు.

"ఏఁమాలతీ! తింటావా? పయనంకట్టమన్నావా?" అన్నాడు.

ఇందుకు మాలతి నొచ్చుకుంది. తను తినకుండా జంకడం ఒకందుకు — పరాయివాడున్నప్పుడెలా? అని. బావ మరోఅర్థంచేసుకున్నాడు. తనొచ్చినందుకు యిష్టంలేక ఇలా తనుచేశానని అనుకున్నాడేమోయని బాధపడింది మాలతి. అవును ... తనెందుకు సిగ్గుపడాలి? అసలు సిగ్గెందుకు? బావ పరాయివాడా? కాడే! తనెందుకు సిగ్గుపడి వూరుకోవాలి? తనతో పలకపోబట్టే బావ అలా భావించాడేమో? ఎన్నెన్నో ప్రశ్నలు సుడిగుండంలో చిక్కిన పుల్లలా రయ్‌మని ఆమె బుర్రలో తిరిగినయ్.

మాలతి అన్నం తలిపిశాక సుబ్బరావుకూడ పూసుకున్నాడు. వెంకాయమ్మ చూస్తూ నవ్వుకుంది తనలో. అందరు భోజనాలు ముగించేరు.

ఆమర్నాడు ట్రయినింగ్ ప్రవేశించాడు. మొత్తం పందమందిదాక శిక్షణకువచ్చారు. అందులో పాతిక మందిదాకా విద్యార్థినులు కూడా వున్నారు. మామూలుగా తొలిరోజు కాలేజిలో స్కూళ్ళలో అటెండెన్సువేసుకొని పంపడమో లేక పిచ్చాపాటీ మాట్లాడుకొని పంపేయడమో జరుగుతుంది. ఇక్కడ ఆ ఆచారాల్లేమీలేవు. లెక్చరర్ వచ్చి, లెసన్‌మీద లెక్చర్లుకొట్టివెళ్ళాడు ప్రప్రథమం లోనే.

* * *

దినాలు గడిచాయి. లేడిలా బెదురుతూ, పిల్లికూనలా నక్కి తిరుగుటమాని, చిన్ననాటి బావతో తిరిగినట్టు, ఇప్పుడు సుబ్బారావుతో కలిసి మెలిసి ప్రవర్తిస్తుంది మాలతి.

ఇప్పుడు ప్రొద్దున్నే కాఫీ మొదలుకుని, రాత్రిభోజనం తినిపించేవరకూ బావకు సేవ చేస్తుంది మాలతి. ఊరంతా యేలి, బావ యిల్లుచేరేసరికి మధ్యాన్నం కాళ్ళకు నీళ్ళివ్వటం, సాయంత్రం బావినీళ్ళు అండాలోకి చేది బావకై యెదురుచూడడంతో జరిగిపోతూంది దినప్రణాళిక.

బావికి అనుకొని బసీను అల్లుతూంది మాలతి. చెకచెకా పిస్టన్లా ఆడుతూన్న సూది నిల్చిపోయింది. దృష్టి ఆకుపచ్చని చెట్ల కొమ్మల్లో దాగుకుంటున్న చీకటిమచ్చలకేసి మళ్ళించి అట్టేవుంది. తన వాలకాన్ని విచిత్రంగా చిత్రించుకుంటూంది. ఉన్నట్టుండి చిలిపిగా చిరునవ్వునవ్వింది. ఆలోచన్లు పూర్వ చరిత్రగూర్చే కాబోలు.

లజ్జపడుతూ, మరుగున తిరుగుతూన్న మాలతి, ఇప్పుడు వికాసంగా, జంకకుండా జింకలా బావదగ్గరగా మసలుతూందంటే ఆశ్చర్యంగావుంది. తనే స్వయంగా అడిగి బావకు కావాల్సిందాన్ని పట్టకొచ్చిస్తుం దిప్పుడు. ఇదివరకు తల్లిదండ్రులు ఎంత చెప్పినా, ఒక్కంగుళం ముందంజవేయని పాదం ఇప్పుడలాంటి అంగుళాల్నేగాక అడుగుల్నే చిటికెలో దాటేస్తుంది.

తన స్వీయచరిత్రలో ఒకనాటి సంఘటనను నెమరువేసింది మాలతి. అత్తయ్య ఈ వూరికొచ్చినప్పుడు తన్ను ముద్దెట్టుకుని, ఎంతగానో తృప్తిపడేది. ఒకమాట అని తనచేత పదిమాటలనిపించి అత్తయ్య నవ్వుకునేది. ఆ మాటల్లో తెలియనికోపం సిగ్గు తేనెబిందువులా ఉన్నాయని తన్నలా చంపుకుతినేది. ఓరోజు సినిమాప్రోగ్రాం పడింది. ఆసాయంత్రం తనముందు మాలతిని కూచోబెట్టుకుని తలదువ్వి జడవేసి సింగారించినాక, అందుకు మురిసిపోయి, అత్తయ్యచుట్టూ గంతులేస్తూ 'నైటింగేల్'లా పాడేసరికి, తనను దగ్గరకు లాక్కుని తనివిదీర బుగ్గలుకొరికి 'ఇలా పెంకిపిల్లవైతే మావాడికిచ్చుకోను' అంది. అంతటితో కళకళలాడుతూన్న ముఖాన్ని కందగడ్డలా మార్చి, మూతిముడుచుకొని 'అఁ... పోకపోక ఆ నల్లనయ్యనే చేసుకోవాలి... వచ్చేవాళ్లెలాగేనా వస్తార్లే' అంటూ ఉద్రుసవెళ్ళింది తను. ఇందుకే కాబోలు ఇందాక తనలో నవ్వుకుంది మాలతి.

అది కొంచెం తెలిసీ తెలియని లేబ్రాయం. ఓసారి బావ యీవూరికి వొచ్చినప్పుడు అతనితోటి ఆడుకునేది, పాడుకునేది. 'చక్కర్లు కొట్టేవాళ్ళు. సుబ్బారావు చామనచాయ చిరునవ్వుమోము తమాషావ్యక్తి. అది తనకు తెలియనితనంగాని — 'ఛ!... ఆ నల్లనయ్యనా పెళ్ళాడేది...' అని అసహ్యించుకునేది. అత్తయ్య అన్నప్పుడు కోపతాపమే గాదు, రోజల్లా ఉపవాసదీక్షపట్టేది. సుబ్బరావు పిల్చినా ఆడుకునేందుకు వెళ్ళేదికాదు. అత్తయ్య క్షమాపణకోర బుజ్జగించినాక దీక్షను విరమించేది మాలతి.

అలాంటిదిప్పుడు, ఐదేళ్లు గడిచాక, తిరిగి బావ కనిపించేసరికి చాటుకెళ్లడం, సిగ్గుతో అభినయము చూసి తనకు నవ్వేసింది. బండి బాడుగిస్తున్నపుడు, షూటు బూటుతోవున్న బావయ్య, తనకు సీమదొరలా ఒక్క మెరుపు మెరిసేడు. ఇదివరకున్న భావాన్ని తుడుచుకుని, ఈనాడు అతిరమ్యంగా చిత్రించుకుని ఆనందించింది. ఆకుల్లో చాటునవున్న మొగ్గ మోమువిప్పి తేనెటీగను పిలుచుకుంది. '...బావ...నన్ను...' అప్రయత్నంగా నవ్వుకుంది మళ్ళా

ఇంట్లో అడుగుపెట్టగానే ఎదురువచ్చే మాలతి కనిపించనందుకు బెంగతో బావిదగ్గర కెళ్ళాడు సుబ్బరావు. మాలతి బావికానుకొని కుట్టుపనిచేస్తున్నది చూచాడు. సద్దుకలుగుతుందేమోనని బూట్లులేకుండా వచ్చి, వెనకాలే మాలతి కళ్ళుమూశాడు. అతని చేతుల్ని స్పృశిస్తూ 'అమ్మదొంగా! పువ్వును దొంగలించాలనుకున్నావ్?...' అని నవ్వింది. సుబ్బారావు మాలతిచేతుల్ని తనచేతుల్లోకి తీసుకొని 'ఎప్పటికైనా దొంగలించాలిగా?' అంటూ ప్రక్కన కూచున్నాడు. ఇన్నాళ్ళుగా కలిసి మెలసి వుంటున్నారు. మాలతి అభిప్రాయమేటో తెలుసుకోవాలని నిశ్చయించుకున్నాడు సుబ్బరావు.

"మాలతీ!" అన్నాడు ఆతురతతో. చెప్పేదేంటో వినాలని అతని కళ్ళల్లోకి చూసింది. '...కోపం రాకుంటే, ఓ సంగతి అడగనా?...' అన్నాడు మళ్ళా. మాలతి ఓరగాచూస్తూ 'ఊఁ...' అంది.


## కస్తూరి మాత్రలు

జలుపు, సాధారణ శీతలముచేత దగ్గులు, జ్వరము, గొంతులో కరకరమనియుండుట, తల భారము మొదలగువాటిని పోగొట్టును. ఈ మాత్రలు బిడ్డలుమొదలు వృద్ధులువరకు ఎంతవయస్సుండినను వాడుకోవచ్చును.

25 మాత్రలు గల బుడ్డి 1-8 రు. 1-0-0

తపాలా చార్జి రు. 1-0-0

ధనలక్ష్మి అండ్ కో,

సాకార్‌పేట — మద్రాసు-1

"ఎవర్ని ప్రేమిస్తున్నావ్?"

"........................"

"నేనంటే... ఇష్టంలేదా?"

"........................"

"నిన్ను విడిచివుండలేను మాలతీ! తప్పక పెళ్లిచేసుకుంటాను... అదీ నీ యిష్టమైతేనే" అన్నాడు. అతని మాంసపుముద్దలో అణువణువునా, ఇన్నాళ్లుగన్న తీయని స్మృతులు దూరమైపోతాయేమో యని భయపడ్డాడు. మాలతిముఖంలో మెరిసిన కళ్లనుచూసి తనకేదో కావాల్సిందాన్నిస్తుందని, ఆశతో వచ్చేమాటకు యెదురుచూశాడు.

"అంత పుణ్యమా బావా కలగాదుగా!" అంటూ అతనిముఖంలోకి సూటిగా చూసింది. సుబ్బరావుకి అర్థమయింది. ఆపాదమస్తకం గగుర్పొడిచింది. తనచేతుల్తో ముఖాన్నెత్తి దృక్కులు ఆమెకళ్లలోకి దూసుకుపోయేలాగ ముఖంలో ముఖంపెట్టి — "కాదు... నిజంగానే... చేసుకుంటా—" అన్నాడు.

కొద్దిక్షణాలు నిశ్శబ్దంగా అలాగే గడిచినయ్. నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ—'ఎవరికీ ఈ అల్లకం?' అన్నాడు.

"శ్రీవారికే! జ్ఞాపకార్థంగా ఇద్దాము" అని నవ్వి 'ఆఁ... మామూలు మరిచా... పదస్నానంచేద్దూగాని!' అంది. తన రెండు చేతుల్తో సుబ్బరావుని లేవదీసింది. బావి నీళ్ళు అండాలోకి తోడి, బావగారికి సిద్ధం చేసింది మాలతి.

* * *

ప్రక్కింటిలో 'నీపేరు విన్నా, నీ రూపు కన్నా... ఇన్నాళ్లదాకా మారని మనసు ఈ దినమేల ఇటులాడేనూ...' అన్న ప్రేమలేఖలోని రికార్డింగ్ సాంగ్ వినిపిస్తూంది. మాలతికి తనస్థితికి ఆశ్చర్యంవేసింది. మార్పుకు కారణం ఆలోచించింది. 'అవును... నిజమే మారని మనస్సు ఇప్పుడెలా మారిందో?' అని తన్ను ప్రశ్నించుకుంది. జవాబు దొరకలేదు. పక్కన నవ్వుతుంది తనలో కలిగిన మార్పుకు. నిత్యం ఉత్సాహంతో ప్రతిపని చురుగ్గా చేస్తుంది మాలతి.

* * *

మూడునెల్లు ముగిసినయ్.

పయనం కట్టాల్సొచ్చినందుకు బాధపడ్డాడు సుబ్బారావు. ఇహ పోక తప్పింది కాదు. మాలతితో మధురంగా గడిపిన దినాలన్నీ ఒక్కక్షణమాత్రమే అనుభవించినట్లు ఫీలయ్యాడు. ఊరికెళ్ళాక మాలతి దగ్గరలేని ప్రతిక్షణం ఒక యుగంగా గడపాల్సొస్తుందని ఎంతగానో బాధపడ్డాడు.

తనపై ప్రాణాలప్పచెప్పిన అత్తయ్యను వదిలిపెట్టలేక కాళ్లు తడబడ్డాయి. మావయ్య తీసుచూసి తల్లడిల్లాడు. ఎందుకున్నా సరే తమ అల్లుడు సుఖంగావుంటే చాల్లేనని పూరుకున్నారు.

బావ వెళ్తుండాడని, హృదయాన్ని పులిగోళ్ళతో పీకినట్లు బాధపడింది మాలతి, బావురుమంది. మాలతిదగ్గర సెలవుతీసుకునేందుకు వెళ్ళాడు సుబ్బారావు. ప్రక్కగదిలో మూలగోడకానుకొన్న మాలతి కళ్ళలోంచి కారుతున్న కాటుకనీరు అతనిలో అంతులేని బాధను కలిగించింది. అప్రయత్నంగా రెండు బిందువులు రాల్చాడు. ఆవిధంగా బాధపడి ఏంచేస్తాడూ? ఉత్తరోత్తరా తమ యిద్దరు శాశ్వతంగా కలుసుకుంటాంగా! అనే ధీమాతో చల్లబడ్డాడు సుబ్బరావు.

మాలతిని తనచేతుల్లోకి తీసుకొని, కన్నీరు తుడుస్తూ—'మాలతీ! నిన్ను విడిచివెళ్లలేకపోతున్నాను. నాహృదయం నీలాగే తపించిపోతూంది. దిగులుపడకు ... నీవు సుఖంగా వుంటేనే నాసుఖం ... ... ఇదిగో! కడసారి మాట—ఆకాశంవచ్చి మీదపడినను, నిన్ను వదలను మాలతీ... తప్పక పెళ్ళాడుతాను మాలతీ...' అని వాగ్దానంచేశాడు. ఇంకా మాలతి తృప్తిపడలేదని చూలతి చేయిపట్టుకుని వచ్చి, అత్తయ్య, మావయ్యదగ్గర 'నాకు మాలతికి త్వరగా పెళ్ళి నిశ్చయంచేయండి. లేకుంటే మాలతి బాధపడుతుంది' అన్నాడు. 'అంతకన్నా మాకు కావాల్సిందేముంది నాయనా' అని సమ్మతి తీసుకుని బయల్దేరాడు సుబ్బరావు.

"బావా! బావా! వెళుతున్నావా?" అని బావురుమంది. కిటికీలోంచి బావచూపుమేరకు వెళ్ళిందాకా ఏకధారగా కన్నీరుకారుస్తూ అట్టే వుండిపోయింది మాలతి.

